# తెలుగులో (చ) వచ్చాయ్
# స్పాన్సర్డ్ ప్రోగ్రాములు

ఆ రోజు శంకరం ఇంట్లో చాలా హడావిడిగా ఉంది. అందరూ ఎవరి పనులు వాళ్ళు చకచకా చేస్కుని పోతున్నారు.

శంకరం పిల్లలు బుజ్జి, చిన్నిగాడు ఇద్దరూ ఎవరూ చెప్పకుండానే హోంవర్కు గబగబా చేసేస్తున్నారు.

రోజూ తీరుబడిగా వంటచేసి రాత్రి తొమ్మిది గంటలకు భోజనం వడ్డించే జానకి కూడా ఆరోజు చకచకా వంటపని పూర్తిచేయసాగింది.

"ఇదిగో .... రేపొద్దున్నకి కూరలున్నాయా? ఇప్పుడే చెప్పు వెళ్ళి తెస్తా.... ఆనక తెమ్మంటే నేను తేను తెల్సిందా?...." అంటూ గావు కేక పెట్టాడు వంటింట్లోకి చూస్తూ శంకరం.

జానకి వంటింట్లోంచి రివ్వున వచ్చింది.

"హబ్బబ్బ.... ఎందుకలా నా పని కాకుండా నన్ను డిస్టర్బ్ చేస్తారు? ఇందాకనే చెప్పాగా కూరగాయలున్నాయని.... ఇహ నన్ను పిలిస్తే నేనూరుకోనంతే .. " అంటూ గయ్యిమని లేచింది.

"ఇప్పుడున్నాయని ఆనక లేవు అఁ జెప్పి నన్ను బజారెళ్ళమంటే నేనూ ఊర్కోను" శంకరం కూడా గయ్యిమని లేచాడు.


జానకి రయ్యిమని వంటగదిలోకి వెళ్తూ నేలమీద తడి ఉండడం చేత జర్రున జారి ధామ్మని పడింది.

"హబ్బబ్బా.... ఇంకా పది నిముషాలు టైముంది.... ఎందుకంత కంగారూ?...." విసుక్కున్నాడు శంకరం.

"కంగారు కాపోతే?.... నేను టీవీ చూడాలి. మీకు వేళకి ముద్ద తగలెయ్యాలంటే కంగారుపడకుండా జరుగుతుందా?.... జానకి కూడా విసుక్కుంది.

ఆ రోజు వాళ్ళు అంత హడావిడి పడడానికి కారణం ఆ రోజు నుండే టీవీలో తెలుగులో స్పాన్సర్డ్ ప్రోగ్రామ్‌లు (వాణిజ్య కార్యక్రమాలు) మొదలవుతున్నాయ్.. అంటే హిందీలో బునియాద్, కరంచంద్, సుభాహ్ ప్రోగ్రాములు ఎలానో అలాగన్నమాట!

"హిందీలో పూర్తిగా డైలాగులు అర్థంకావు! అయినా ఆ ప్రోగ్రాములు చాలా బాగుంటాయ్!!.. తెలుగులో అన్ని డైలాగులూ అర్థం అవుతాయి కాబట్టి తెలుగు స్పాన్సర్డ్ ప్రోగ్రాంలు ఇంకా బాగుంటాయ్.. హాయ్ హాయ్" అన్నాడు శంకరం వంటగదిలోంచి కొంగుకి చేతులు తుడుచుకుంటూ వచ్చి జానకితో.




"ఊ ఊ.. ప్రోగ్రాంలు బాగుంటాయని నన్ను పట్టించుకోడం మానేసి టీవీకి అతుక్కుపోదు కదా కొంపతీసి.. అట్టా చేస్తే వీపు చీర్తాను అంది జానకి ఓరకంట సిగ్గుగా శంకరంపైపు చూస్తూ.

"ఏంటి వంటపనై పోయిందా తీరుబడిగా చేతులు తుడుచుకుంటూ వస్తున్నావ్?" అడిగాడు శంకరం.

"అయిపోయింది గానీ.. ప్రోగ్రాం వచ్చే టైమైంది.. టీవీ పెట్ట

కుంటా అలా దేభ్యం మొహంవేస్కుని కూర్చున్నారేం?.." కసురుకుంది జానకి.

శంకరం టీవీ ఆన్ చేశాడు.

ఎనౌన్సర్ ముప్ఫైరెండు పళ్ళ నవ్వు మొహం టీవీ స్క్రీన్‌మీద కనపడింది.

"హిహి.. ఇంతసేపూ మీరు అవులు పేడేసే కార్యక్రమం చూశారు.. హి.. తెలుగు వాళ్ళు ఎంతకాలం నుంచో ఎదురు చూస్తున్న స్పాన్సర్డ్ ప్రోగ్రామ్స్ ఈ రోజునుండి ప్రారంభం అవుతున్నాయ్. కొద్ది క్షణాల్లో 'మా ఊళ్ళో ఒక ఢమాల్' స్పాన్సర్డ్ ప్రోగ్రామ్ మొదలవుతుంది.. హిహిహిహిహిహి.." అలా పది సెకన్లపాటు టీవీ యనౌన్సర్ నవ్వు మొహం స్క్రీన్ మీద కనబడింది.

బుజ్జి, చిన్నిగాడూ స్కూలు పుస్తకాలు అవతల విసిరికొట్టి టీవీ ముందు కూర్చున్నారు. శంకరం, జానకి సోఫా అంచుమీద కూర్చుని దీక్షగా టీవీ వంక చూడసాగారు.

టీవీలో వర్సగా ఎడ్వర్టైజ్‌మెంట్లు రాసాగాయ్.

"మీ జుట్టు ఉండదమో ఊడిపోవడమో అటో ఇటో తేల్చి చెప్పే ఛటాఫట్ హేరాయిల్ వాడండి.. అటో ఇటో తేల్చుకోండి.."

"నేను చాలా కాలం నిరుద్యోగిగా ఉన్నాను— కానీ— ఆ దివ్యమైన రోజు నేను నా గోళ్ళకి గత్తర్ బిత్తర్ గోళ్ళరంగు వేస్కుని ఇంటర్వ్యూకి వెళ్ళాను. నా బాస్ నా గోళ్ళ— దాని కంటిపెట్టుకుని ఉన్న గత్తర్ - బిత్తర్ గోళ్ళ రంగు చూసి నాకుద్యోగం ఇచ్చాడు— ఇప్పుడు నా జీవితంలో సగం డబ్బు గత్తర్ - బిత్తర్ గోళ్ళ రంగుకే ఖర్చవుతుంది— హిహి— మీరు కూడా వాడండి గత్తర్ - బిత్తర్ గోళ్ళ రంగు!"

అలా ఆగకుండా వర్సగా వస్తూనే ఉన్నాయ్ అడ్వర్టైజ్‌మెంట్లు.

శంకరం నిట్టూర్చాడు—

"ఇవయ్యేలోగా మనం భోంచేసి రావొచ్చేమో!"

"మీరు నోర్మూయ్యండి— మీకెప్పుడూ తిండి సొదే! —" కసిరింది జానకి.

"వా — ప్రోగ్రాం ఇంకా రాలేదు — వహ్హా—"

హఠాత్తుగా చిన్నిగాడు నేలమీద దొర్లి ఏడవసాగాడు.

సరిగ్గా అప్పుడే అడ్వర్టైజ్‌మెంట్లు ఆగిపోయాయ్.

"ఒరేయ్ నీ ఏడుపాపరా — ఎడ్వర్టైజ్‌మెంట్లు అయిపోయాయ్-" అంటూ అరిచింది జానకి.

టీవీ స్క్రీన్‌మీద స్పాన్సర్డ్ ప్రోగ్రాం మొదలవుతున్నట్లుగా "మా ఊళ్లో ఒక ఢమాల్" అన్న టైటిల్ పడింది.

చిన్నిగాడు ఏడుపాపి నేలమీంచి లేచి బుద్ధిగా కూర్చున్నాడు.

జానకి హఠాత్తుగా సోఫాలోంచి కంగారుగా లేచింది.

"వామ్మోవ్—వాయ్యోవ్—" అంటూ గుండెలు బాదుకుంది.

"ఏంటి? — ఏమైంది? —" శంకరం కూడా కంగారుగా అడిగాడు.

"చెంబులూ గిన్నెలూ పడిపోతున్నట్టు శబ్దం వస్తుందిగా? — వంటగదిలో పిల్లో కుక్కో దూరినట్టుంది!" వంటగదివైపు హడావుడిగా అడుగులేస్తూ అంది జానకి.

శంకరం కిసుక్కున నవ్వాడు!

"హోసీ పిచ్చిదానా ఆ శబ్దాలు వంటగదిలోంచి రావడంలేదు టీవీలోంచి వస్తున్నాయ్ మా ఊళ్ళో ఒక ఢమాల్ టైటిల్ మ్యూజిక్ అలా ఉందన్నమాట! హిహి" అన్నాడు శంకరం నవ్వాపుకుంటూ.

జానకి తేలిగ్గా ఊపిరి పీల్చుకుని సోఫాలో కూర్చుంది.

టైటిల్స్ అయిపోయాయ్..

స్పాన్సర్డ్ ప్రోగ్రాం మొదలయ్యింది. స్క్రీన్‌మీద హీరో మొహం క్లోజప్‌లో కనిపించింది.

అంతే..

బుజ్జి, చిన్నిగాడూ భయంగా టీవీకి దూరంగా జరిగారు.

ఉన్నట్టుండి హీరో నవ్వాడు!

బుజ్జి బిక్కమొహం వేసింది గానీ, చిన్నిగాడు మాత్రం భయంతో గజగజా వణికి "బేర్ ర్" మని ఏడ్చాడు.

"ఏంటలా దేభ్యం మొహమేసుక్కుని చూస్తున్నారు? చిన్నిగాడు భయపడి ఏడుస్తున్నాడు వాణ్ణి దగ్గరికి తీసుక్కుని ఒళ్ళోకూర్చోబెట్టుకోండి" అంటూ కసురుకుంది జానకి.

శంకరం చిన్నిగాడిని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు.

"భయం లేదమ్మా ఇది టీవీలో ప్రోగ్రామే కదా ఆ మనిషి టీవీ లోంచి బయటికి రాడు కదా? ఏడవకమ్మా" అంటూ ఊరుక్కోబెట్టాడు.

"నాన్నా నాన్నా మరేమో ఇది డ్రాకులా రాస్ససుడి కథా?!" అంటూ కళ్ళు ఇంతింత జేసి భయంగా స్క్రీన్‌వంక చూస్తూ అడిగింది బుజ్జి.

"కాదమ్మా మామూలు కధే"

"మరి ఆ అబ్బాయి కేంటి పళ్ళు కోరల్లా ఉన్నాయ్! కట్టలు కట్టలుగా అన్ని పళ్ళున్నాయేం? హబ్బ ఎంత భయంకరంగా ఉన్నాడో" అంది గుండెలమీద చెయ్యేసుక్కుంటూ.

"ఏమోనమ్మా.. ఈ కథకి అలా పళ్ళుండే అబ్బాయ్ కావాలేమో!"

"నాన్నా నాన్నా హీరో హీరోయిన్లు ఏం మాట్లాడరేం! వాళ్ళు మూగాళ్ళా మాటలు రావా?" చిన్నిగాడు ధయిర్యం తెచ్చుకుని టీవీ వంక చూస్తూ అన్నాడు.

"కాదమ్మా అలా కాస్సేపు మూగగా ఉండి ఆనక మాట్లాడతారు మళ్ళీ మూగగా ఉండి వచ్చేవారం మాట్లాడతారు అలా డైలాగులు లేకుండా చేస్తే దాన్ని మనం ఆర్ట్ ఫిల్మ్ అని అనుకుంటామనీ డైరెక్టర్ అలా చేశాడన్నమాట!" చెప్పాడు శంకరం.

హీరో ఏదో డైలాగ్ చెప్పాడు.

"అమ్మగారూ అమ్మగారూ!" గుమ్మంలో నిలబడి ఒక అసామీ అరవసాగాడు.

"ఏంటయ్యా ఏంటి? సరిగ్గా సమయానికి గోల!" విసుక్కుంటూ అడిగింది జానకి.

"నా గేదె తప్పిపోయిందమ్మా!" అన్నాడు అతను దీనంగా.

"అయితే ఏమంటావ్?" కోపంగా అడిగింది జానకి.

"మీ ఇంట్లోంచి గేదె అరిచిన శబ్దం వినిపించిందమ్మా అది నా గేదేనమ్మా"

శంకరం జానకి ఫక్కుమని నవ్వారు.

"హార్నీ అది నీ గేదె గొంతు కాదయ్యా! టీవీలో తెలుగు స్పాన్సర్డ్ ప్రోగ్రాం వస్తుంది. హీరో గేదె అరిచినట్టు మాట్లాడుతున్నాడు అంతే" అన్నాడు శంకరం.

ఆ ఆసామి సిగ్గుతో చచ్చిపోయాడు.

"క్షమించండమ్మా అచ్చు నా గేదె గొంతులా ఉంటే పొరపాటు పడ్డాను" అని వెళ్ళిపోయాడు.

జానకి మళ్ళీ వచ్చి టీవీ ముందు కూర్చుంది, హీరో హీరోయిన్లు చెక్క మొహాలేసుకుని ముఖంలో ఏ భావం కనిపించకుండా జాగ్రత్త పడుతూ మధ్య మధ్య చిన్న చిన్న డైలాగులు భావం పలక్కుండా జాగ్రత్తగా అంటున్నారు.

హఠాత్తుగా ఆ వారానికి ఆ సీరియల్ అయిపోయినట్టుగా మళ్ళీ టైటిల్స్ పడ్డాయ్ తరువాత ఇరవై దాకా అడ్వర్ టైజ్ మెంట్లు.

"నానా నాహన్నా దీనికంటే రోజూ వచ్చే ఆవు పేడేసే కార్యక్రమం. పందులు పెంచడం. టీవీ వాళ్ళు వేసే చెక్క మొహంగాళ్ళ నాటకాలు బావుంటాయి కదూ!" అడిగింది బుజ్జి.

"అవుననుకుంటానమ్మా...." అన్నాడు శంకరం.

వాళ్ళకే కాదు.... టీవీ ఉండే ప్రతి తెలుగువాడికీ అనిపించింది. ఇంతకాలంగా తెలుగు స్పాన్సర్డ్ ప్రోగ్రాముల గురించి ఇంతిలా వెర్రి మొహల్లా ఎందుకు ఎదురు చూశామా అని.